## హైబ్రిడ్‌కు ఓకే కానీ..

**ఐసీసీకి పీసీబీ పలు డిమాండ్లు**

దుబాయ్/కరాచీ: చాంపియన్స్ ట్రోఫీ(2025) నిర్వహణపై సందిగ్ధత కొనసాగుతూనే ఉన్నది. హైబ్రిడ్ మోడల్ విషయంలో ఐసీసీ అల్టిమేటంకు ఒకింత వెనుకకు తగ్గిన పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ) పలు డిమాండ్లు ముందుపెట్టింది. ఓవైపు హైబ్రిడ్ పద్ధతికి ఓకే అంటూనే వచ్చే మూడేండ్లు భారత్‌లో జరిగే ఐసీసీ టోర్నీలకు ఇదే పద్ధతి వర్తింపజేయాలని షరతులు పెట్టింది. శనివారం చాంపియన్స్ ట్రోఫీ నిర్వహణపై పీసీబీ చీఫ్ మోహిసిన్ నక్వీ స్పందిస్తూ ' టోర్నీ నిర్వహణపై నేను అతిగా మాట్లాడాను. అలా చేస్తే పరిస్థితులు ఇంకా క్లిష్టంగా మారుతాయి. మేము మా ప్రతిపాదనలు ఐసీసీ ముందు ఉంచాం, భారత్ కూడా వారి సిఫార్సులు చెప్పింది. ఏ నిర్ణయం తీసుకున్నా..అది అందరికీ సమానంగా ఉండాలి. అంతిమంగా క్రికెట్ గెలువాలన్నదే మా తపన అదే సమయంలో పాకిస్థాన్ ఆత్మగౌరవం కూడా ముఖ్యమే' అని అన్నాడు. దీనికి తోడు వార్షిక ఆదాయ వాటాలను కూడా ఐసీసీ పెంచాలని పీసీబీ డిమాండ్ చేస్తున్నది.

# ఫైనల్లో సింధు

**సెమీస్‌లో ఉన్నతిపై అలవోక విజయం • టైటిల్ పోరుకు లక్ష్యసేన్ • సయ్యద్ మోడీ టోర్నీ**



లక్నో: సయ్యద్ మోడీ ఇంటర్నేషనల్ సూపర్-300 టోర్నీలో భారత షట్లర్ల హవా కొనసాగుతున్నది. గత కొన్నేండ్లుగా గాయాలకు తోడు ఫామ్‌లేమితో సతమతమవుతున్న స్టార్ షట్లర్ పీవీ సింధు మళ్లీ గాడిలో పడింది. టోర్నీలో ఫైనల్లోకి దూసుకెళ్లి సత్తాచాటింది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ సెమీస్‌లో టాప్‌సీడ్ సింధు 21-12, 21-9తో భారత్‌కే చెందిన ఉన్నతి హుడాపై అలవోక విజయం సాధించింది. 36 నిమిషాల్లో ముగిసిన పోరులో సింధు పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. తన అనుభవాన్నంత ఉపయోగిస్తూ డ్రాప్ షాట్లు, నెట్‌గేమ్‌తో ఆకట్టుకుంది. మరోవైపు ఇప్పుడిప్పుడే కెరీర్‌లో నిలదొక్కుకుంటున్న ఉన్నతి..ఒత్తిడికిలోనై అనవసరపు షాట్లతో ప్రత్యర్థికి పాయింట్లు సమర్పించుకుంది. తొలి గేమ్‌లో సింధు 5-3తో ముందంజ వేసింది. పుంజుకునేందుకు ప్రయత్నించే క్రమంలో ఉన్నతి షాట్లను సరైన రీతిలో ఆడలేకపోయింది. దీంతో సీనియర్ షట్లర్ ఆధిక్యం 11-8కు చేరుకుంది. ఇదే అదనుగా విజృంభించిన సింధు..తన ట్రేడ్‌మార్క్ బేస్‌లైన్ స్మాషెస్ జోలికి పోకుండానే ఉన్నతి పనిపట్టింది. రెండో గేమ్‌లోనూ అదే దూకుడు కొనసాగించిన ఈ తెలుగు షట్లర్ వరుస పాయింట్లతో మ్యాచ్‌ను కైవసం చేసుకుంది. ఆదివారం జరిగే ఫైనల్లో చైనాకు చెందిన యవు లు యుతో అమీతుమీ తేల్చుకోనుంది. ఆ తర్వాత మాట్లాడుతూ ' ఈ రోజు నా ప్రదర్శనపై చాలా సంతోషంగా ఉన్నాను. ఆది నుంచే ఆధిక్యం కొనసాగిస్తూ వచ్చాను. బేసిక్స్‌కు కట్టుబడి ఉంటూ మ్యాచ్ ఆడాను. మొత్తంగా ఈ విజయం ఆత్మవిశ్వాసాన్నిచ్చింది. ప్లేయర్ల కెరీర్‌లో ఒడిదొడుకులు సహజం. వయసును బట్టి మనలో ఫిట్‌నెస్ స్థాయి మారుతూ ఉంటుంది. అందుకు తగ్గట్లు మార్పులు చేసుకోవాలి' అని అంది.

**టైటిల్ పోరుకు లక్ష్యసేన్:**

పురుషుల సింగిల్స్‌లో యువ షట్లర్ లక్ష్యసేన్ టైటిల్ పోరుకు సిద్ధమయ్యాడు. శనివారం జరిగిన సింగిల్స్ సెమీస్‌లో లక్ష్యసేన్ 21-8, 21-14తో షోగో ఓగావ(జపాన్)పై గెలిచాడు. ఫైనల్లో జపాన్ షట్లర జియా హెంగ్‌జాసన్‌తో తలపడుతాడు. మిగతా మ్యాచ్‌ల్లో మిక్స్‌డ్ డబుల్స్ సెమీస్‌లో ధ్రువ్ కపిల, తనీషా క్యాస్ట్రో జోడీ 21-16, 21-15తో చైనా ద్వయం జౌ జీ, యాంగ్ జిపై గెలిచింది. మహిళల డబుల్స్‌లో అశ్విని పొనప్ప, తనీషా క్యాస్ట్రో 21-14, 16-21, 13-21తో చైనా జంట బావో లీ జింగ్, లి క్విన్‌పై గెలిచి ఫైనల్లోకి ప్రవేశించింది. పురుషుల డబుల్స్‌లో భారత జోడీ పృథ్వీ, సాయి ప్రతీక్ 21-17, 17-21, 21-16తో ఇషాన్ భట్నాగర్, శంకర్ ప్రసాద్‌పై గెలిచి టైటిల్ పోరులో నిలిచింది. మరో మహిళల డబుల్స్ సెమీస్‌లో గాయత్రీ గోపీచంద్, త్రిసా జాలీ జోడీ 18-21, 18-21, 10-21తో బెన్యప, నుత్కకరన్ ద్వయం చేతిలో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించింది.



## జాతీయ బ్యాడ్మింటన్ చాంప్ హంసిని

హైదరాబాద్, ఆట ప్రతినిధి: జమ్ము కశ్మీర్ వేదికగా జరిగిన 36వ సబ్‌జూనియర్ జాతీయ బ్యాడ్మింటన్ టోర్నీలో రాష్ట్ర యువ షట్లర్ చదరం హంసిని విజేతగా నిలిచింది. శనివారం జరిగిన బాలికల అండర్-13 ఫైనల్లో హంసిని 21-17, 21-18తో బెదాగ్ని గొగోయ్(అస్సాం)పై అద్భుత విజయం సాధించింది. ఆది నుంచే తనదైన జోరు కనబరిచిన హంసిని వరుస గేముల్లో ప్రత్యర్థిని మట్టికరిపించింది. బాలుర అండర్ -13 డబుల్స్‌లో రాష్ట్ర జోడీ విదిత్‌రెడ్డి, శ్రీచేతన్ 17-21, 13-21తో యూపీ ద్వయం ఆదిత్యసింగ్, తన్మయ్ వర్మ చేతిలో ఓడి రన్నరప్‌తో సరిపెట్టుకుంది. ఇదే టోర్నీలో బాలుర సింగిల్స్‌లో అనికేత్ దత్తా, బాలికల డబుల్స్ లో ఆర్యమ చక్రవర్తి, లక్ష్మిసాయి విజేతగా నిలిచారు. ఇదే టోర్నీలో యువ షట్లర్ భవేశ్‌రెడ్డి మూడో స్థానంలో నిలిచాడు. విజేతలను బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ గోపీచంద్, భాస్కర్‌బాబు, బల్వీర్‌సింగ్, లక్ష్మణ్, వంశీధర్ తదితరులు అభినందించారు.




## రాష్ట్ర స్థాయి రగ్బీ టోర్నీ షురూ..

మహబూబ్‌నగర్ అర్బన్, నవంబర్ 30 : రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. శనివారం రాత్రి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని స్టేడియంలో 69వ ఎస్‌జీఎఫ్ అండర్-14 రాష్ట్ర స్థాయి రగ్బీ టోర్నీని ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శారదాబాయి, ఆర్గనైజింగ్ సెక్రటరీ నిరంజన్‌రావుతో కలిసి ఎంఈవో లక్ష్మణ్‌సింగ్ ప్రారంభించారు. ఉమ్మడి పది జిల్లాల నుంచి 200 మంది బాలబాలికలు పాల్గొని మార్చ్‌పాస్ట్ నిర్వహించారు. ఈనెల 2వ తేదీ వరకు లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో పోటీలు జరగనున్నాయి.

## తొలి రోజు వర్షార్పణం

కాన్‌బెర్రా: అడిలైడ్ టెస్టుకు సన్నాహంగా భారత్, ప్రైమినిస్టర్ లెవన్ మధ్య ఏర్పాటు చేసిన ప్రాక్టీస్‌పై వరుణుడు నీళ్లు గుమ్మరించాడు. తొలి రోజు శనివారం ఎడతెరిపిలేని వర్షంతో ఒక్క బంతి కూడా పడకుండానే రద్దయ్యింది. ఉదయం నుంచి కురిసిన వానతో మైదానం మొత్తం చిత్తడిగా మారిపోయింది. దీంతో ఆటకు అనువుగా లేకపోవడంతో అంపైర్లు మ్యాచ్‌ను నిలిపివేశారు. రెండో రోజైన ఆదివారం 50 ఓవర్ల చొప్పున మ్యాచ్ ఆడేందుకు సిద్ధమయ్యాయి. పెర్త్ టెస్టులో ఆడని కెప్టెన్ రోహిత్‌శర్మ, శుభ్‌మన్ గిల్ మ్యా చ్ ప్రాక్టీస్ దక్కకుండా పోయింది.



ఈనెల 6 నుంచి మొదలయ్యే రెండో టెస్టులో రోహిత్, గిల్ తుది జట్టులోకి వచ్చే అవకాశ ముంది. దేవదత్ పడిక్కల్, ధృవ్ జురెల్‌ను తప్పించనున్నారు.

## హాజిల్‌వుడ్ ఔట్

**అడిలైడ్ టెస్టుకు దూరం**

అడిలైడ్: భారత్‌తో రెండో టెస్టుకు ముందు ఆస్ట్రేలియాకు ఎదురుదెబ్బ తగిలింది. ఇప్పటికే పెర్త్ టెస్టులో భారీ ఓటమి మూటగట్టుకున్న ఆసీస్ టీమ్‌కు స్టార్ పేసర్ జోష్ హాజిల్‌వుడ్ దూరమయ్యాడు. ఈనెల 6 నుంచి అడిలైడ్‌లో మొదలయ్యే డే అండ్ నైట్ టెస్టు నుంచి గాయం కారణంగా వైదొలిగినట్లు క్రికెట్ ఆస్ట్రేలియా(సీఏ) శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది. గాయపడ్డ హాజిల్‌వుడ్ జట్టుతో కొనసాగుతాడని పేర్కొన్న సీఏ.. అతని స్థానంలో సీన్ అబాట్, డగెట్‌ను జట్టుకు ఎంపిక చేసింది. పింక్‌బాల్ టెస్టుల్లో హాజిల్‌వుడ్‌కు మంచి రికార్డు ఉంది. గతంలో అడిలైడ్ టెస్టులో భారత్‌ను 36కే ఆలౌట్ చేయడంతో హాజిల్‌వుడ్ కీలకమయ్యాడు.

## ఐదో గేమ్ డ్రా

సింగపూర్: ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్‌లో డింగ్ లిరెన్, గుకేశ్ మధ్య డ్రాల పరంపర కొనసాగుతున్నది. శనివారం జరిగిన ఐదో గేమ్‌లో తెల్లపావులతో బరిలోకి దిగిన గుకేశ్..లిరెన్‌తో కడదాకా పోరాడి గేమ్‌ను డ్రా చేసుకున్నాడు. దీంతో వరుసగా రెండో డ్రా ఎదురుకావడంతో ఇద్దరు ప్రస్తుతం 2.5 పాయింట్లతో కొనసాగుతున్నారు. ఎవరైతే తొలుత 7 పాయింట్లు సాధిస్తారో వారినే ప్రపంచ టైటిల్ వరించనుంది.

## సఫారీల భారీ గెలుపు

డర్బన్: శ్రీలంకతో జరిగిన తొలి టెస్టులో దక్షిణాఫ్రికా 233 పరుగుల తేడాతో భారీ గెలుపుతో సిరీస్‌లో 1-0 ఆధిక్యం సాధించింది. సఫారీలు నిర్దేశించిన 516 పరుగుల లక్ష్యఛేదనలో ఓవర్‌నైట్ స్కోరు 103/5తో నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్‌కు దిగిన లంక 282 పరుగులకు పరిమితమైంది. 11 వికెట్లు ఖాతాలో వేసుకున్న జాన్సెన్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

## ఈనెల 7 నుంచి సీఎం కప్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: గ్రామీణ ప్రాంత ప్లేయర్ల ప్రతిభను వెలుగులోకి తీసుకొచ్చే లక్ష్యంతో మొదలైన సీఎం కప్ టోర్నీ షెడ్యూల్ ఖరారైంది. శనివారం ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన మీడియా భేటిలో సాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి పలు అంశాలను వివరించారు. ఈనెల 7నుంచి గ్రామస్థాయిలో మొదలై..10-12 వరకు మండల, 16 నుంచి 21 వరకు జిల్లా, 27 నుంచి జనవరి 2 వరకు రాష్ట్ర స్థాయిలో పోటీలు జరుగుతాయని ఆయన తెలిపారు. టోర్నీలో పోటీపడే ప్లేయర్ల కోసం గేమ్స్ మేనేజ్‌మెంట్ సిస్టం(జీఎంఎస్) ద్వారా రిజిస్ట్రేషన్లు చేసుకునే అవకాశం కల్పించారు.

## భారత్‌కు పరాభవం

**పాకిస్థాన్ చేతిలో ఓటమి**

దుబాయ్: అండర్-19 యూత్ ఆసియాకప్‌లో భారత్‌కు పరాభవం ఎదురైంది. శనివారం పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో టీమ్‌ఇండియా 43 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. పాక్ నిర్దేశించిన 282 పరుగుల లక్ష్యఛేదనలో యువ భారత్ 47.1 ఓవర్లలో 238 పరుగులకు ఆలౌటైంది. నిఖిల్‌కుమార్(67) ఒంటరిపోరాటం జట్టును గెలిపించలేకపోయింది. ఐపీఎల్‌లో 1.10కోట్లు పలికిన 13 ఏండ్ల వైభవ్(1) ఘోరంగా నిరాశపరిచాడు. అలీ రజా(3/36), అబ్దు ల్(2/46) రాణించారు.



నిఖిల్‌కుమార్ (67)

తొలుత ఓపెనర్ షహజాబ్ (159) సెంచరీకి తోడు ఉస్మాన్(60) ఆకట్టుకోవడంతో పాక్ 50 ఓవర్లలో 281/7 స్కోరు చేసింది. నాగరాజ్(3/45), ఆయూశ్(2/30) రాణించారు.

## లాన్ టెన్నిస్‌లో ఐజీపీ టీమ్‌కు స్వర్ణం

హైదరాబాద్, నవంబర్ 30 (నమస్తేతెలంగాణ): పోలీస్‌శాఖ, పారామిలటరీ బలగాల సిబ్బందికి సీఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో 50 ప్లస్ కేటగిరీలో నిర్వహించిన ఆల్‌ఇండియా లాన్ టెన్నిస్ పోటీల్లో మల్టీజోన్-1 ఐజీపీ చంద్రశేఖర్‌రెడ్డి నేతృత్వంలోని టీమ్ స్వర్ణం సాధించింది. శనివారం బెంగళూరులో జరిగిన ఫైనల్లో చంద్రశేఖర్‌రెడ్డి, నారాయణపేట ఏఆర్ అదనపు ఎస్పీ రియాజ్ జోడీ 9-6 స్కోర్ తేడాతో, ఏపీకి చెందిన డీఎస్పీలు రామ్‌కుమార్, సత్యనారాయణ ద్వయంపై విజయం సాధించింది.








Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.